# ఎన్. జీ. వో. సంజెప్రణయం

(సినిమాకి ఓ సీక్వెన్సు)

తారాగణం:
"పూభా",
మిసెస్. "పూభా"

కథ, సంభాషణలు:
"పూభా"

"శ్రీమతీ! శ్రీమతీ!" తలుపుతట్టుతూ—!

"............"

"వస్తున్నా."—తలుపుతీస్తూ—"రోజు కు రోజూ మరీ బాగుంది. ఇంతవరకూ ఆఫీసుపనేనా?"

"ఏంచెయ్యమంటావ్?"

"కాస్త వేగం యింటికి రమ్మంటాను."

"కాస్త ఏమిటి ఎంతో వేగంగా వచ్చేద్దామనే ఉంటుంది. కాని పని."

"యింట్లో ఒక్కర్తెనూ దెయ్యంలా పడిఉండవలసిందేగా."

"ఇంట్లో పాతిక కుటుంబాలవాళ్లు ఉంటూంటే దెయ్యంలా కూర్చోడం ఏం ఖర్మం!"

"అయితే వీళ్ళ గుమ్మందగ్గరా వాళ్ళ గుమ్మం దగ్గరా డేకురుతూ కూర్చోమన్నారన్నమాట."

"పోనీ, ఏదేనా పుస్తకం చదువుకోకూడదూ? పుస్తకాల్నిమించిన స్నేహితులే లేరన్నాడు ఒక ప్రబుద్ధుడు."

"అందుకనే కాబోలు మీరు ఆఫీసును వదలరు వేగం."

"నా చేతుల్లోనే ఆఫీసు ఉన్నట్టు మాటాడతావ్."

"అయిదు గంటలయాక ఆఫీసు ఉండదేమో కదండీ?"

"అచ్చులో పడ్డంతమట్టుకు అది నిజమే."

"అంటే!"

"అంటే అచ్చుపడ్డ రూల్సుకీ చేసే పనులకీ ఎప్పుడూ సమన్వయం కుదరదని తాత్పర్యం."

"సమన్వయమో దండాన్వయమో...దువ్వెన తీసుకువచ్చారా?"

"గట్టివి దొరకలేదు."

"మజ్జిగకి వెళితే దూడచచ్చిన కబుర్లే చెపుతారు ఎప్పుడున్నూ."

"బజార్లోలేని వస్తువుల్ని నేను పుట్టిస్తానా!"

"దేశం గొడ్డుపోయింది."

"అయితే ఉండీ తేలేదంటావా?"

"పోనీ మొన్నను తెచ్చినలాటిదైనా తేలేకపోయారా?"

"ప్లాస్టిక్ దువ్వెనలు నేను తీసుకురాదలచుకోలేదు."

"ఏదో ఒకటి తేకపోతే ఎలాగండీ. బొత్తిగా యిబ్బందిగా ఉందే."

"మనవి యినప బుర్రలు. ప్లాస్టిక్ దువ్వెనలు తలమీదవేసి దువ్వేసరికి విరిగిపోతూంటే ఎన్నని కొనడం?"

"పోనీండి కాని అవునండీ!"

"ఏమండీ?"

"అదుగో అప్పుడే వేళాకోళం ఆరంభించారు."

"ఇందులో వేళాకోళం ఏముంది?"

"ఆ అండీలోనే ఉంది బండెడు."

"ఇంతకీ ఏమిటో శలవివ్వండి?"

"అదుగో మళ్ళీ."

"లేదు. లేదు. చెప్పు."

"నే నేమన్నా మీకు వికటంగానూ, వేళాకోళంగాను ఉంటుంది. అసలు నా బ్రతుకే వేళాకోళం అయిపోయింది."

"అరే! అప్పడే ఏడుపు వచ్చేస్తోందే. యీ ఆడవాళ్ళకి సహజ కవచంలా ఉంది ఏడుపు. అసలు ఏమిటో చెప్పు."

"అక్కర్లేదు లెండి."

"అప్పుడే అలక వచ్చేసింది. స్త్రీలకి అలక

కూడా సహజ సంపదే కదూ. ఇంతకీ అసలు చెప్పావు కావు.”

“మీరు చెప్పనిస్తేనా?”

“చెప్పనివ్వక నోరు మూసేనా?”

“చాల్లెద్దురూ.”

“చెవుదూ.”

“బంగారం చవకై పోయిందిట.”

“ఒక్క బంగారమేమిటి. అన్నీ చవకయి పోయాయిట.”

“అట అంటారేమిటి మీరు కూడా!”

“మరేం అనమంటావ్?”

“ఇంట్లో కూర్చున్న ఆడవాళ్ళం అలా అంటాం కాని బజార్లంట తిరుగుతూన్న మీరు కూడా ‘అట’ కబుర్లు చెబుతారేమిటి?”

“బజార్లంట తిరుగుతే ప్రతిషాపుకీ వెళ్ళి ఆ వస్తువు ధర ఎంత, యీ వస్తువు ధర ఎంత అని భోగట్టా చెయ్యాలి కామోసు.”

“తెలుసుకోకపోతే ఎలా?”

“తెలుసుకున్నాంగా పేపరుచూసి. ఇంతకూ బంగారం ధర మన కెందుకు!”

“ఎందు కేమిటి యిలాంటప్పుడే ఏమైనా కొంటారేమో అని.”

“అదా! పాపం చాలా రోజులనుంచి శ్రమ పడి ఆలోచిస్తున్నటుంది.”

“పోనీండీ! ఎప్పుడూ అలాగే అంటారు.”

“ఇంట్లో డబ్బు మూలుగుతున్నట్టు కబుర్లు చెప్తావు. ఈ కరువులోంచి బ్రతికి బయట పడితే నగలూ, నాణ్యాలూ చేయించుకున్నట్టే!”

“ఇంకా కరువంటారేమిటండీ. ధరలు పడి పోయాయిటగా!”

“పడిపోయాయని పేపర్లో పడిపోయాయి. బజార్లో మాత్రం మన నిత్యజీవితానికి కావలసిన వస్తువులన్నీ మామూలుకన్న బాగా పెరిగాయి.”

“మీరు మరీ విచిత్రంగా చెపుతారు.”

“అసలు విచిత్రం అదే. పేపర్లో పడిందేదో అదే నిజం కాని మన ఎదుట జరిగేదంతా అబద్ధం అనే పరిస్థితికి వచ్చాం!”

“మిమ్మల్ని అడగటమే తప్పు.”

“ఇన్నాళ్లూ ఎలాగో ఓపికపట్టావా...”

“నాలుగు రోజులుపోతే ఒళ్ళంతా బంగారం అయిపోతుంది.”

“అదికాదే! మనకి ఎన్నో సదుపాయాలు చేస్తున్నారు గవర్నమెంటువారు.”

“బంగారం యిస్తారు కామోసు!”

“నీకుఎంతసేపూబంగారంబంగారంబంగారం.”

“ఏమిటో చెప్పండి.”

“ఉచిత విద్య, ఉచిత వైద్యం యింకా యిలాంటి సౌకర్యాలు ఎన్నో చేస్తుంది గవర్నమెంటు. అప్పుడు నాలుగుపైసాలు వెనకబడితే.”

“అయితే మా తమ్ముణ్ణి తీసుకువద్దామండీ, చదువుకుంటాడు. పల్లెటూరులో పడి పాడైపోతున్నాడు. ఇంతకీ మనం పెట్టేవి నాలుగు మెతుకులే కదూ. మా అమ్మని తీసుకువచ్చి మందు యిప్పించినా బాగుణ్ణు.”

“చదువు మన పిల్లలకైతేనే చెప్పిస్తారు.”

“సరిసరి! మనవాడు ఎదిగేసరికి యీ రూల్సు మారిపోతాయేమో.”

దానికి నేను గ్యారంటీ యివ్వగలనా? అయిదు సంవత్సరాల కొకసారి గవర్నమెంటు మారుతుంది. అప్పటివాళ్ళ బుద్ధి ఎలా వికసిస్తుందో.”

“అయితే యిప్పుడు యింతకీ...”

“అంతా మామూలే.”

## “ త్వ మే వా ఽ హ మ్ ”

స్వల్పమైన అవకాశంతో స్వల్పమైన ఆశయాలతో అల్పమైన జీవితాన్ని బాపోరుస్తూ ఈడుస్తూ పొద్దున్నే బద్ధకంగా నిద్రలేచి తొందరగా ఆఫీసు మొగాన్ని తగిలించుకొని భయపడుతూ ఉద్యోగాన్ని నిర్వేదాన్ని పొదుగుతూ నీరసంగా ఇల్లు చేరుకొని ఆయాసంగా నిద్రపోతూ ఇలాగే ఊపిరి పీలుస్తారు వీళ్లు

మా జీవితాలకల్లా
సారె గదిలోనిదే రొమాన్సు
పెద్ద దొరముందు
మాట్లాడడమే ఎడ్వెంచరు
ఇంక్రిమెంటే మోక్షం.

—ఆరుద్ర